



అడుగు తేలిన నవాబుపేట రిజర్వాయర్

గంగ..బెంగ...!

- రోజురోజుకూ పడిపోతున్న భూగర్భజలాలు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో 9.04 మీ. దిగువన నీళ్లు
- తరువాతి స్థానాల్లో చిలుపూర్, నర్మెట, రఘునాథపల్లి మండలాలు
- మరో రెండుమీటర్లకు పడిపోనున్నట్లు అంచనా
- చెరువులు, కుంటలు, బావుల్లో తగ్గుముఖం పట్టిన నీటిమట్టం

లింగాలఘణపురం, జనవరి16: జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. వరుసగా గత మూణ్నెళ్లుగా వర్షాలు లేకపోవడానికి తోడు యాసంగి సాగుతో నీటి వినియోగం గణనీయంగా పెరగడంతో క్రమంగా అడుగంటుతున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో అట్టడుగున 9.04 మీటర్ల దిగువన నీటిమట్టం ఉంది. గత నవంబర్‌లో చిల్పూరు మండలంలో భూగర్భ జలమట్టం 5.05 మీటర్ల దిగువన ఉండగా అదే డిసెంబర్ మాసానికి వచ్చేసరికి 7.30 మీటర్ల లోతుకు పడిపోయాయి. అంటే ఒక నెల వ్యవధిలోనే 2.25 మీటర్ల లోతుకు వెళ్లాయి. దీన్ని పోల్చుకుంటే జనవరిలో మరో రెండు మీటర్లకు పైగా పడిపోనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గత సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో కురిసిన వర్షాలతో జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండుకుండలను తలపించాయి. దీంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి బోర్లు, బావుల్లో నీటి ఊటలు ఉప్పొంగడంతో అన్నదాత ఆనందంలో మునిగితేలాడు. గతేడాది యాసంగిలో వడగండ్ల కారణంగా పంటలను నష్టపోయిన అన్నదాతలు ఈసారైనా ఆశాజనకంగా ఉంటుందేమోనని గంపెడాశలతో వరిసాగు చేసుకుంటున్నారు. దీంతో భూగర్భజలాల వినియోగం పెరిగి నీటి మట్టం తగ్గిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. గతేడాది జనగామ జిల్లాలో సగటున డిసెంబర్-2022లో 4.53 మీటర్ల దిగువన భూగర్భజలాలు ఉండగా ఈ ఏడాది డిసెంబర్-2023లో 6.09 మీటర్ల స్థాయికి పడిపోయాయి. చిలుపూర్ మండలంలో గత ఏడాది డిసెంబర్-2022లో 3.82 మీటర్ల దిగువన ఉండగా ఈ ఏడాది డిసెంబర్-2023లో 7.30 మీటర్లకు చేరుకుని గతేడాదితో పోల్చుకుంటే 3.48 మీటర్ల లోతున పడిపోయాయి. అదేవిధంగా నర్మెటలో 4.81 నుంచి 8.23 మీటర్లకు, రఘునాథపల్లిలో 4.46 నుంచి 8.03 మీటర్లకు, కొడకండ్ల మండలంలో 5.66 నుంచి 7.57మీటర్లకు పడిపోయాయి. జిల్లాలో అత్యధిక దిగువన స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో గతేడాది డిసెంబర్-2022లో 10.05 ఉండగా ఈ ఏడాది డిసెంబర్-2023లో 9.04 మీటర్ల స్థాయికి చేరుకుని మిగతా మండలాలతో పోల్చుకుంటే విభిన్నంగా ఇక్కడ భూగర్భజలమట్టం 1.01 మీటర్లకు ఎగువకు చేరుకోవడం విశేషం.

బావుల్లో తగ్గుతున్న నీటి మట్టం

యాసంగి సీజన్ వరినాట్లు ఊపందుకోవడంతో భూగర్భ లాల వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. దీంతో జనవరి మొదటి వారం నుంచే నీటి ఊటలు తగ్గిపోయి బోర్లు నీటిని తక్కువగా పోస్తున్నాయి. దీంతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. యాసంగి నాట్లు వేసి నెలరోజులు గడవక ముందే బోరుబావుల్లో నీటి ఊటలు తగ్గిపోతుండడం, దానికి తోడు ఎండల తీవ్రత కూడా రోజురోజుకూ పెరుగుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.



నీళ్లు లేక బోసిపోతున్న నవాబుపేట కెనాల్

పంట చేతికొచ్చేదాకా నమ్మకం లేదు..

- నారగోని రాజుగౌడ్, చిలుపూర్ గుట్ట



బోరుబావుల కింద సాగు చేసిన పంట చేతికొచ్చేదాకా నమ్మకం లేకుండా ఉంది. వారం కింద పోసిన బోరు నీళ్లు ఈ వారం వచ్చే వరకు తగ్గిపోస్తు న్నాయి. గత నాలుగైదు రోజుల నుంచి ఎండలు కూడా పెరిగిపోవడంతో పొలంలో నీళ్లు ఎప్పటికప్పుడు ఆరిపోతున్నాయి. యాసంగి పంటలో పెట్టుబడి సొమ్ముకు కూడా గ్యారంటీ లేకుండా ఉంది.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి..

- దూసరి గణపతి- సర్పంచ్‌లఫోరం మండల అధ్యక్షుడు, లింగాలఘణపురం



ఫిబ్రవరి మాసం నుంచే ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. దీంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉండదు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ తీసుకుని నవా బుపేట రిజర్వాయర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెరువుల్లో గోదావరి జలాలతో నింపాలి. లేకపోతే యాసంగి పంటలు చేతికం దడం కష్టమే.

రైతులు మెట్టపంటలను సాగు చేసుకోవాలి

- అశోక్‌కుమార్- అసిస్టెంట్ డైరెక్టర్, భూగర్భజలశాఖ, జనగామ జిల్లా



డిసెంబర్-2022లో ఉన్న భూగర్భ జలాలతో పోల్చుకుంటే డిసెంబర్-2023లో 1.56మీటర్ల లోతులో పడిపోయాయి. జిల్లాలో భూగర్భ జలాలను సగటున పరిశీలిస్తే డిసెంబర్-2022లో 4.53 మీటర్లు ఉండగా డిసెంబరు-2023లో 6.09మీటర్లకు పడిపోయింది. అందువల్ల రైతులు వరి కాకుండా మెట్టపంటలను సాగు చేసుకోవాలి. ఉచిత కరెంట్ పేరిట కరెంట్ మోటార్లను ఇష్టారాజ్యంగా ఆన్‌చేసి నీటిని అనవరంగా వృథా చేయకుండా నీటిని పొదుపుగా వాడుకోవాలి.

మండలం	డిసెంబర్ 2022	డిసెంబర్ 2023	తేడా
బచ్చన్నపేట	4.07	4.36	-0.29
చిల్పూరు	3.82	7.30	-3.48
దేవరుప్పుల	1.15	2.67	-1.52
స్టేషన్‌ఘన్‌పూర్	10.05	9.04	+1.01
జనగామ	2.85	4.44	-0.92
కొడకండ	5.66	7.57	-1.91
లింగాలఘణపురం	4.02	5.18	-1.16
నర్మెట	4.81	8.22	-3.41
రఘునాథపల్లి	4.46	8.03	-3.57
తరిగొప్పుల	4.46	6.30	-1.84
జఫర్‌ఘడ్	5.2	6.18	-0.98
పాలకుర్తి	4.73	6.92	- 2.19

పులకించిన 'ఆలేటి ఎల్లవ్వ'

- శివసత్తుల పూనకాలతో దద్దరిల్లిన ఆలయ ప్రాంగణం
- జాతరకు వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం
- మొక్కులు సమర్పించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి
- పూజలు చేసిన మాజీ మంత్రి దయాకర్‌రావు



ఆలయం వద్ద బోనాలతో మహిళలు

పాలకుర్తి, జనవరి 16: మండలంలోని బమ్మెర, అయ్యంగారిపల్లి గ్రామాల మధ్య కొలువైన ఆలేటి ఎల్లవ్వ జాతర భక్తజన సందోహంతో అట్టుడికింది. మంగళవారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో పోటెత్తింది. శివసత్తుల పూనకాలు, మహిళలు బోనమెత్తుకొని ఎల్లవ్వ తల్లిని దర్శించుకున్నారు. పాడి పంటలు, పిల్లా పాపలను చల్లంగ చూడాలని వేడుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. పాలకుర్తి మండలంలోని బమ్మెర, తొర్రూరు, అయ్యంగారిపల్లి, ఈరవెన్ను, లక్ష్మీనారాయణపురం, గూడూరు, తిర్మలగిరి, రామవాపురం, నర్సింగపురంతండా, కోతులబాదు, కిష్టాపురంతండా, గోపాలపురం గ్రామాలనుంచి ఎడ్లబండ్లతో వచ్చి గుడి చుట్టూ ప్రదక్షిణ చేశారు. గుడి ముందు పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. సంతానం లేని వివాహితలు తాడి చెట్టు వద్ద వరం పట్టారు.

బోనమెత్తుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మంగళవారం ఎల్లవ్వ తల్లిని దర్శించుకున్నారు. ఇద్దరూ బోనమెత్తుకొని గుడి చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లవ్వను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మొదటి రోజు 15న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించి పూజలు చేశారు. బమ్మెర నుంచి ఆలేటి ఎల్లవ్వ ఆలయం వరకు, అయ్యంగారి పల్లి బస్‌స్టేజీ నుంచి గుడి వరకు మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో రూ. 2 కోట్లు వెచ్చించి బీటీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచు జల్లం నాగభూషణం, వైస్ ఎంపీపీ దార శారద శంకరయ్య, పార్టీ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి తదితరులు పూజలు చేశారు.

కిక్కిరిసిన జాతర..

ఆలేటి ఎల్లవ్వ జాతరకు భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, మోటార్ సైకిళ్లపై వేలాది మంది తరలివెళ్లి మొక్కులు చెల్లించారు. కాగా, జాతరకు వచ్చే వాహనాలను అయ్యంగారిపల్లి బస్‌స్టేజీ వద్ద పోలీసులు నిలిపివేశారు. దీంతో భక్తులు కిలోమీటరు దూరం కాలినడకన వెళ్లాల్సి వచ్చింది. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులుపడ్డారు.



బోనమెత్తుకొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి



తాటిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

వైభవంగా 'సామూహిక రేపల్లె' వ్రతాలు

- శ్రీకృష్ణుడిని కొలుస్తూ ఆర్యవైశ్య మహిళల పూజలు

జఫర్‌గడ్, జనవరి 16: సంక్రాంతి వచ్చిందంటే చాలు ప్రత్యేకంగా తెలంగాణలో మహిళలు, కొత్తగా వివాహమైన యువతులు వ్రతాలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఈ నేపథ్యంలో జఫర్‌గడ్‌లో ఆర్యవైశ్య మహిళలు, కొత్తగా పెళ్ళయిన 50 మంది యువతులు స్థానిక ఆర్యవైశ్య భవనంలో సోమవారం సామూహికంగా రేపల్లెవాడ వ్రతాలు చేశారు. శ్రీకృష్ణ భగవానుడికి ఎంతో ఇష్టమైన ఈ నోమును మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. 13 రకాల చిన్న చిన్న పాత్రలతో దీక్షగా కూర్చున్న మహిళలు.. వాటికి సున్నం, పసుపు, కుంకుమ, కంకణాలతో అలంకరించి అందులో మజ్జిగ, వెన్న పోశారు. నోములు ఆచరిస్తున్న అతివలంతా గోపికల వలె ముస్తాబై శ్రీకృష్ణుడిని కొలుస్తూ పూజించి.. పిల్లా పాపలతో మము సల్లంగ చూడు స్వామి.. అంటూ వేడుకున్నారు. ఆ జగద్రక్షకుడిని కీర్తిస్తూ పాటలు పాడారు. పరస్పరం వాయినాలు ఇచ్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మహిళా సంఘం ప్రతినిధులు అంచూరి కమల, ఇమ్మడి మాధవి, దాంశెట్టి శ్రావ్య, గందె సమత, పాలకుర్తి సరోజన, అనూష, అనిత, స్రవంతి, అంచూరి స్వాతి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జఫర్‌గడ్‌లో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

చర్మకారులకు మంచి రోజులు

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్‌లో చర్మకారులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 16: అనేక ఏళ్లుగా లెదర్‌పార్కు ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్న చర్మకారులకు మంచి రోజులు వచ్చాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి పియూష్‌గోయల్‌తో భేటీ అయి ఈ విషయంపై చర్చించారని, పరిశ్రమకు అడుగులు పడేలా కృషి చేశారని అన్నారు. ఇందుకు కృతజ్ఞతగా మంగళవారం డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట చర్మకారులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు లెదర్‌పార్కు విషయంలో నిర్లక్ష్యం చేశాయని, కాంగ్రెస్ ప్రభుత్వంతో అది సాధ్యం కాబోతోందని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరబోయిన శ్రీరాములు, జగదీష్‌చందర్ రెడ్డి, శిరీష్ రెడ్డి, నీల శ్రీధర్, దయాకర్, గుర్రం యాదగిరి, మంద రమేష్, తీగల మహేందర్, సింగపురం రాజు, చర్మకారుల సంఘం నాయకులు గాదె కుమారస్వామి, చేపూరి కుమారస్వామి, అనంతపురం చంద్రమౌళి, రాజారపు మల్లేషం, మారపాక శ్రీనివాస్, ఈశ్వరయ్య, ప్రేమానందం, జీడి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



మైసూరులో సంక్రాంతి వేడుకల్లో తెలంగాణ వాసులు

ముగిసిన మూడు రోజుల పండుగ

ఆనందంగా జరుపుకున్న జిల్లా ప్రజలు

జనగామ కల్చరల్, జనవరి 16: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు ఉత్సాహపూరిత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. భోగి పండుగతో ప్రారంభమైన వేడుకలు సోమవారం కనుమ పండుగతో ముగిశాయి. చిన్నారులు పతంగులు ఎగురవేసి ఆనందించారు. మహిళలు సంక్రాంతి నోములు నోచుకున్నారు. ఒక్కో రకమైన 21 వస్తువులు, 21 పిండి వంటలు తయారు చేసి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. సకల సౌభాగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని వేడుకున్నారు. అనంతరం ముత్తయిదువలను పిలిచి వారికి వాయినాలు ఇచ్చి సాగనంపారు. సంప్రదాయ బద్ధంగా ఇండ్లలో పాలు పొంగించి నవధాన్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లోని వీధులు రంగవల్లులతో కళకళలాడాయి. మూడు రోజుల పాటు వీధులు ముగ్గులతో సరికొత్త శోభను సంతరించుకున్నాయి. చివరి రోజయిన మంగళవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో బొమ్మల కొలువు నిర్వహించారు. ఇంటి ముందు రథం ముగ్గు వేశారు. జిల్లాలో అక్కడక్కడా రహస్యంగా కోడి పందాలు కూడా నిర్వహించినట్లు సమాచారం.

మైసూరులో సంక్రాంతి వేడుకలు...

జనగామకు చెందిన కొంత మంది ఉపాధ్యాయ దంపతులు సంక్రాంతి సెలవుల సందర్భంగా మైసూరు, ఊటీ, కూనూరు విహారయాత్రకు వెళ్లారు. సంక్రాంతి రోజు వారు బస చేసిన చోటే రంగవల్లిక వేసి వేడుకలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు...

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జనగామ మునిసిపాలిటీ పరిధి 11వ వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

లయన్స్ ఆధ్వర్యంలో..

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో ఆర్య వైశ్య సంఘం, స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి వేరువేరుగా మంగళవారం విజేతల ఇంటింటికీ తిరిగి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆర్డీవో వాసం రామ్మూర్తి, ప్రముఖ రచయిత్రి, కవయిత్రి నెల్లుట్ల రమాదేవి, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పార్శీ కమల్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మన పండుగల, సంక్రాంతి ముగ్గుల ప్రాముఖ్యతను, ప్రాశస్త్యాన్ని వివరించి, సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలన్న లక్ష్యంతో ముగ్గుల పోటీలు ఏటా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమాల్లో ఆ యా సంఘాల నాయకులు తెల్లాకుల రామకృష్ణ, ఐత బుచ్చిబాబు, ఐత సంతోష్, లయన్స్ క్లబ్ నుంచి లయన్ సామల ఉపేందర్, క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.



స్టేషన్ ఘన్‌పూర్‌లో రంగోళి పోటీలో స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ తరుపున బహుమతులు అందిస్తున్న ఆర్డీవో రామ్మూర్తి, కవయిత్రి రమాదేవి

ఏటీఎంలలో చోరీకి యత్నం

డబ్బులు రాకపోవడంతో ఐదు మిషన్ల ధ్వంసం

వరంగల్ జిల్లా నర్సంపేటలో ఘటన





వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్, ధ్వంసమైన ఎస్‌బీఐ ఏటీఎం మిషన్

నర్సంపేట టౌన్, జనవరి 16 : జల్సాలకు అలవాటుపడిన ఓ కొరియర్ బాయ్ ఏకంగా ఐదు ఏటీఎంలలో చోరీకి యత్నించాడు. డబ్బులు రాలేదన్న అక్కసుతో ఏటీఎం మిషన్లను రాళ్లతో ధ్వంసం చేశాడు. ఘటన జరిగిన నాలుగు గంటల్లోనే సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు.

వరంగల్ జిల్లా నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్ వివరాలను వెల్లడించారు. నర్సంపేట పట్టణంలోని మాధన్నపేటరోడ్‌కు చెందిన యువకుడు మేడిద వంశీ కొన్ని రోజులుగా ఓ కంపెనీలో కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు, మద్యానికి అలవాటుపడి డబ్బులు సరిపోక ఏటీఎంలపై కన్నేశాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం సేవించి ద్వారకపేటరోడ్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం, వరంగల్‌రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం, నెక్కొండ రోడ్‌లోని కెనరా బ్యాంక్ ఏటీఎం, మల్లంపల్లి రోడ్‌లోనీ ఎస్‌బీఐ, పాకాల్‌రోడ్‌లోని కొటాక్ మహింద్రా బ్యాంక్ ఏటీఎంలో చోరీకి యత్నించాడు. ఎక్కడ కూడా డబ్బులు తీయడం సాధ్యం కాకపోవడంతో రాళ్లతో అన్ని మిషన్లను ధ్వంసం చేశాడు. సమాచారం తెలుసుకున్న నర్సంపేట సీఐ సుంకరి రవికుమార్, ఎస్సై రవి సీసీ పుటేజీల ఆధారంగా సంఘటన జరిగిన నాలుగు గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. వంశీపై కేసు నమోదు రిమాండ్‌కు తరలించారు. కాగా, ఈ సంఘటనల్లో సుమారు. రూ. 4.05లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని డీసీపీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులను అభినందించారు.



హమూతండాలో ట్రాక్టర్‌లో మృతదేహాలు

హమూతండాలో విషాదం

నలుగురి దుర్మరణం ఘటనతో గ్రామస్థుల కన్నీరుమున్నీరు

గూడూరు, జనవరి 16: విధి వైపరీత్యం అంటే ఇదేనేమో..! జిల్లాలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడిన విషయం విదితమే. దేవుడిని దర్శించుకుని వస్తూ అనంతలోకాలకు వెళ్లిపోవడంతో హము తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ గిరిజన కుటుంబాన్ని బలితీసుకుంది. ఆటోను కారు ఢీకొని జరిగిన ప్రమాదంలో తల్లి, కుమారుడు, ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు మండలం హముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను, అతని తల్లి పాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికతో పాటు బావమరిది సంతోష్ (సర్దార్), అత్త శాంతిలతో కలిసి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ దగ్గర బుడియబాపు ఆలయానికి ఆటోలో వెళ్లారు. అక్కడ రిత్విక్ పుట్టువెంట్రుకలు సమర్పించి తిరిగి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి బయలు దేరారు. మహబూబాబాద్‌కు చెందిన కారు గుంజేడు నుంచి మహబూబాబాద్‌కు వైపువస్తూ ఎదురు వస్తున్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇస్లావత్ శ్రీనుతోపాటు తల్లిపాప, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్వికలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అత్త శాంతి, బావమరిది సర్దార్ తీవ్రంగా గాయపడ్డారు. వారికి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. కాగా, మూడు సంవత్స రాల క్రితం శ్రీను భార్య సంధ్య (శిరీష) కొవిడ్‌తో మృతి చెందింది. సంక్రాంతి పండుగ వేళకుమారుడి పుట్టువెంట్రుకలు ఇచ్చి వస్తూ రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో హముతండాలో విషా దఛాయలు అలుముకున్నాయి. కాగా, సోమవారం నలుగురి మృతదేహాలకు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాలను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ నివాళ్లర్పించారు. జిల్లా జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.



కంబాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్లావత్ శ్రీను కుటుంబం (ఫైల్)

అత్తారింటికి వచ్చిన వ్యక్తిపై దాడి

తీవ్ర గాయాలపాలైన యువకుడు

పెద్దవంగర, జనవరి 16: మండలంలోని కొరిపెల్లిలో ఓవ్యక్తిపై దాడి చేయగా, తీవ్ర గాయాలపాలయ్యాడు. మంగళవారం ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలరానికి చెందిన తుమ్మ దీపకొరెడ్డి- మహేశ్వరి దంపతులు కుమార్తె రిషితతో కలిసి సంక్రాతి పండుగ సందర్భంగా సోమవారం కొరిపెల్లిలోని అత్తగారైన నీరటి నాగమ్మ ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేసిన తర్వాత మిత్రులతో కలిసి బయటకు వెళ్లగా, పెద్దచెరువు సమీపంలో దీపకొరెడ్డిపై అదే గ్రామానికి చెందిన సాకి యాకయ్య, అతని కుమారులు సాయికుమార్, మహేష్, రాములు అనే నలుగురు వ్యక్తులు కత్తులు, కర్రలతో దాడి చేయడంతో ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో దీపకొరెడ్డిని బంధువులు, గ్రామస్థులు చిక్సిత నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేయిట్ తరలించారు. అనంతరం మెరుగైన చిక్సిత కోసం హన్మకొండకు తరలించారు. అయితే పాత కక్షలతోనే ఈ దాడికి పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. కాగా, దీపకొరెడ్డి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న తుమ్మ దీపక్‌రెడ్డి

ఐలోని మల్లన్న.. సల్లంగ సూడు..

• మల్లికార్జునస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు • మహానివేదనతో మార్నేనియుల దేవుడి రథం ఊరేగింపు



ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు



మహానివేదనతో ఆలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్న మార్నేనియుల పెద్దరథం

ఐనవోలు, జనవరి 16: పూసల లాగులు.. గజ్జెల మోత.. డోలు శబ్దాలు.. చేతుల్లో వీరకోలు.. త్రిశూలాలు.. ఖడ్గాలు.. నొదుటిపై బండారి పసుపు.. నెత్తిపై బోనాలు.. అందులో వెలుగుతున్న దీపాల మధ్య గుంపులు గుంపులుగా జానపద గేయాలతో శివసత్తులు నృత్యాలు చేస్తున్న దృశ్యాలు.. ఐలోని మల్లన్న ఆలయంలో భక్తిపారవశ్యాన్ని ప్రతిబింబించాయి. ఇక ఒగ్గు పూజారుల అందమైన పిండి పట్నాలు ఢమురక శబ్దాలతో భక్తులకు స్వామి వారి కృప కలగాలని స్తుతించారు. సకం భాగ్యాలు కలిగి సంతోషాన్ని కలిగించి.. ముట్టింది ముచ్చమై.. పట్టింది బంగారమై.. పాలి వాడు దగ్గరై.. పగవాడు దూరం కావాలంటూ.. పర్వతాల మల్లయ్య మా పాలిట కలిగి ఉంటూ.. సల్లంగా సూడు మళ్లీ వస్తాం..' అంటూ స్వామి వారిని వేడుకున్నారు.

పోటెత్తిన భక్తజనం

ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతరలో భక్తులు పోటెత్తారు. సంస్కృతి, సంప్రదాయాలు, జానపదులకు ప్రతీక అయిన బండారితో మల్లన్న క్షేత్రం పసుపుమయమైంది. సోమవారం సంక్రాంతి పర్వదినం రోజున రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి మొదలైన భక్తుల రాక.. అర్ధరాత్రి వరకు రద్దీగా కొనసాగింది. ఐలోని మల్లన్న.. అంటూ స్వామివారిని కీర్తిస్తూ పరవశించిపోయారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, బిల్వార్చన మహానివేదన నీరాజన పుణ్యాహవాచనము పూజలు జరిపారు. మల్లికార్జునస్వామికి వెండి కిరీటం, కవచం సుగంధాలు వెదజల్లే పుష్పమాలతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచి తెల్లవారువరకు అభిషేకాలు దర్శనాలు జరిగాయి.

మహానివేదనతో దేవుడి రథం

మార్నేని వంశీయుల ఆధ్వర్యంలో అనాదిగా వస్తున్న మహానివేదన దేవుడి రథంను డీసీసీబీ చైర్మన్ దంపతులు మార్నేని మధుమతి - రవీందర్ రావు స్వగృహంలో సుందరంగా తీర్చిదిద్దారు. మార్నేని వంశీయులు ఆధ్వర్యంలో మహానివేదనతో బయలుదేరిన రథం గ్రామ పురవీదుల గుండా ఆలయానికి చేరుకొని మూడుసార్లు ప్రదక్షణ చేసింది. మంగళహారతులతో రథానికి మహిళలు స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రభ బండ్లు రథాన్ని అనుసరించాయి. దేవుడి రథం ప్రదర్శన సాయంత్రం 7నుంచి తెల్లవారువరకు కొనసాగింది. రథంతో వచ్చిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు దంపతులను ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీసభ్యులు సంప్రదాయపద్ధతిలో సన్మానించారు.

7లక్షల మంది భక్తుల దర్శనం

ధ్వజారోహణం రోజు నుంచి సోమవారం వరకు సుమారు 7లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారుల అంచనా వేశారు. 17న సంప్రోక్షణ క్రతువు తర్వాత ఉగాది వరకు జరిగే వారాంతపు జాతరలు ప్రతీ ఆది, బుధవారాల్లో లక్షల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి దర్శనం చేసుకుంటారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కుటుంబ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ మేయర్ దంపతులు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు నేతృత్వంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలు బహూకరించి తీర్థ ప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు.

అధికారుల సేవలు

జాతరలో పోలీసుసేవలు బేష్‌గా నిలిచాయి. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు నేతృత్వంలో పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్‌లు బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ద్వారా సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా నీడన జాతర బందోబస్తును డీసీపీ, ఏసీపీలు పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు చెందిన సీఐలు, ఎస్సైలు సుమారు 500మంది విధులు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లాలు జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వసతులు కల్పించారు. జీడబ్ల్యూఎంసీ పారిశుద్య సిబ్బందితోపాటు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్(గ్రామ పంచాయతీ) సిబ్బంది నాలుగు రోజులపాటు నిర్విరామంగా విధులు నిర్వహించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈ సునీత ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ ఏర్పాటు చేసిన ట్యాంకర్లు, నల్లాలు ద్వారా మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేశారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్‌లైన్ శాఖల ఆధ్వర్యంలో 1098 ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీస్‌ల ఆధ్వర్యంలో తప్పిపోయిన పిల్లలు, వృద్ధుల కోసం సహాయ శిబిరాన్ని నిర్వహించారు. వరంగల్ - ఐనవోలు - కొమురవెల్లి- ఆర్టీసీ బస్సులు ద్వారా భక్తులను చేరవేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో



గజ్జెల లాగు పూసల అంగీలో మల్లన్న భక్తుడు

ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు వైద్యసేవలు అందించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు జాతరలో ప్రత్యేక నిఘా పెట్టారు. రెండు రోజులు ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచారు.



ఐనవోలు మల్లికార్జున ఆలయం ఆవరణలో బోనంతో నృత్యం చేస్తున్న శివసత్తి



స్వామిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ దయాకర్, కుటుంబసభ్యులు



స్వామి వారి సన్నిధిలో మాజీ మేయర్ దంపతులు స్వర్ణవరదరాజేశ్వర్‌రావు

23 నుంచి కేయూ ఇంజనీరింగ్ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 16: ఈ నెల 23 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 23, 25, 27, 29, 31,ఫిబ్రవరి 2, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, డెటాసైన్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని ఇంజరింగ్ కళాశాల, కేయూ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సెట్‌లో చూడాలని పరీక్షల నియంత్రణాధికారులు సూచించారు.

19న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, జనవరి 16: ఈ నెల 19వ తేదీన హనుమకొండ ములుగు రోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సెస్ బ్యాంకులో సుమారు 80 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 28 యేళ్ల మధ్య వయస్సు గల ఇంటర్, ఏదైనా డిగ్రీ చేసిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9848895937, 9700922136లో సంప్రదించాలని తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



గునిగంటి తిరుపతి (ఫైల్)

ఎల్కతుర్తి, జనవరి 16: తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడి అక్కడిక్కడే గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దండేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గునిగంటి తిరుపతి (42) వృత్తిలో భాగంగా తాటి కల్లు గీయడానికి వెళ్లాడు. గ్రామ శివారులోని పెద్ద చెరువు కట్ట కింద ఉన్న చెట్టు ఎక్కి కల్లుగీస్తున్న క్రమంలో మోకు జారీ పైనుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుజురాబాద్ సివిల్ అస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సరిత, కుమార్తె రక్షిత, కుమారుడు సాత్విక్‌లు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు తిరుపతి కుంటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

పురుగుల మందుతాగిన వ్యక్తి మృతి

నర్సింహులపేట, జనవరి 16 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన వంతడుపలలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి (48) గ్రామ రెవెన్యూ పరిధిలో రెండేళ్ల కిందట కోళ్లఫామ్ ఏర్పాటు చేసుకుని నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో కోళ్లఫామ్‌లో ఆశించిన మేరకు లాభాలు రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయాడు. తెచ్చిన అప్పులు రెట్టింపుకావడం, భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేవి. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 3న క్రిమిసంహారక మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి తొర్రూరు ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి పెద్దకుమారుడు కార్తీక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

19 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు, జనవరి 16: మండలంలోని బోటిమీదితండా శివారు కొండెంగెలగుట్ట తండాలో ఓ ఇంట్లో నిల్వ చేసిన 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 క్వింటాళ్ల పటికను మంగళవారం పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. కొండెగల గుట్ట తండాకు చెందిన బానోత్ చిన్నమాలు తన ఇంట్లో 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 4 కింటాళ్ల పటిక నిల్వచేసి తండావాసులకు విక్రయిస్తున్న క్రమంలో పట్టుకొని సీజ్ చేసి బానోత్ చిన్న మాలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ పేర్కొన్నాడు.



మేడారంలో వనదేవతలను దర్శించుకున్న భక్తులు

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారంలో భారీగా భక్తజనం

మేడారం, జనవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం కిక్కిరిసిపోయింది. మకర సంక్రాంతి, కనుము పండుగల నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర జరగనున్న నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరకొని వనదేవతలకు పూలు, పండ్లు, చీరె సారె, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం (బంగారం) సమర్పించారు. యాట మొక్కులను చెల్లించుకున్నారు. ఈ రెండు రోజుల్లో సుమారు 2 లక్షలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా..

మాజీ మంత్రి ఈటల రాజేందర్

భీమదేవరపల్లి, జనవరి 16: బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తానని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కొత్తకొండలో విలేకరులతో మాట్లాడుతూ.. తాను కరీంనగర్ మట్టి బిడ్డనని, కరీంగనర్‌లో పలుమార్లు మంత్రిగా పనిచేశానన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అప్పుడు పని చేశానన్నారు. కరీంనగర్ ప్రజలతో తనకు విడదీయరాని అను బంధం ఉందన్నారు. కానీ కరీంనగర్‌లో తమ సిట్టింగ్ ఎంపీ ఉన్నారన్నారు. దీంతో పార్టీ ఆదేశిస్తే ఎంపీగా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం తాము వ్యతిరేకం కాదని, కానీ దీంతో పేదలైన ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా ప్రభుత్వం చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వృక్ష ప్రసాద దాత జన్నాపురెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పృథ్వీరాజ్‌గౌడ్, మాచర్ల కుమార్, అంబీరు కవిత, గోదాల సంపత్, గుండెల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తా...

మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

భీమదేవరపల్లి, జనవరి 16: పార్టీ ఆదేశిస్తే వరంగల్ ఎంపీగా పోటీ చేస్తానని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. కొత్తకొండ జాతరలో సోమవారం వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రంలోని తమ పార్టీ న్యాయకత్వాన్ని ఎదురించి తెలంగాణను సాధించామన్నారు. తాను వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో చిచ్చు పెట్టి పబ్బం గడుపుతోందన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం పేరుతో ప్రజాస్వామ్యాన్ని మోదీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందన్నారు. ఈ సమావేశంలో మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనుకయ్య, నాయకులు ఆదరి రవిందర్, కొల్గూరి రాజు, రవీందర్, డబ్బా శంకర్, మడిపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ రుత్విక్‌సాయికి తెలంగాణ కేడర్



హనుమకొండ రూరల్, జనవరి 16: గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో 558వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన కొట్టి రుత్విక్ సాయికి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కేడర్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ రాంనగర్‌కు చెందిన రుత్విక్‌సాయి ఐపీఎస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన 460వ ర్యాంకర్ పత్తిపాక సాయికిరణ్‌కు కూడా తెలంగాణ కేడర్ దక్కింది.

జై వీరభద్రా..

• భక్త జన జాతరగా మారిన కొత్తకొండ
• మొక్కులు చెల్లించిన మంత్రి పొన్నం ప్రభాకర్
• ఆకర్షణగా నిలిచిన ఎడ్లబండ్ల రథాలు.. మేకల బండ్లు

భీమదేవరపల్లి, జనవరి 16: కొత్తకొండ.. భక్త జన జాతరగా మారింది.. ఎటు చూసినా క్యూలైన్లతో భక్తులు కిక్కిరిసిపోయారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కొత్తకొండ జాతర ఆలయం ప్రాంగణం మొత్తం భక్తి పారవశ్యంతో ఊగిపోయింది. వీరభద్రుడి నామస్మరణతో ఆలయం ఉప్పొంగిపొయింది. సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగతో లక్షలాది మంది భక్తులు హాజరైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కుమార్, వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝూ, డీసీపీ బారీ, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీ వంగ రవి, సర్పంచ్ దూడల ప్రమీల - సంపత్, ఎంపీటీసీ యాటపోలు రాజమణి-శ్రీనివాస్‌లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర స్పెషలాఫీసర్ ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్‌రావులు ఆలయానికి వచ్చిన అతిథులు, భక్తులకు స్వాగతం పలికారు.

ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన 50మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతరలో విశిష్టమైన సేవలందించారు. హనుమకొండ, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగామ, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపడం, ప్రైవేట్ వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఇష్టమైన గుమ్మడికాయలు, కోరమీసాలు భక్తులు సమర్పించారు. ఈ నెల 15న సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన భక్తులతో జాతర మొత్తం కిటకిటలాడింది. భక్తుల రద్దీతో కొత్తకొండ వీధులన్నీ భక్త జనంతో నిండిపోయాయి. చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝూ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ భారీ, ఏసీపీ డేవిడ్ రాజు, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుమారు 400మంది పోలీసులు జాతరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరను విజయవంతంగా పూర్తి చేసిన పోలీసు అధికారులు తిరిగి తమ విధుల్లోకి చేరేందుకు వెళ్లారు.

ప్రత్యేక పూజలు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్వామివారికి సోమవారం ఏకాదశి రుద్రాభిషేకం, వివిధ పండ్లతో రసాభిషేకం, క్షీరాభిషేకం ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. స్వామివారికి కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా పూజలు నిర్వహిస్తే సమస్త పీడల నుంచి విముక్తి



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

కలిగి భోగభాగ్యాలు ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. మంగళవారం నాడు నాగవెల్లి, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నల్లపూసలను అలంకరింపజేశారు. అనంతరం పుష్పోత్సవం నిర్వహించారు.

మొక్కులు చెల్లించిన లక్షలాది మంది భక్తులు

కొత్తకొండ దేవాలయంలో మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని సోమ, మంగళవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. మకర సంక్రాంతి, కనుమ పండగ రోజుల్లో భక్తులతో ఆలయం మొత్తం కిటకిటలాడగా క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో రాత్రి వేళల్లోనే జాతర ఎక్కువ సాగేది. అలాంటిది ప్రస్తుతం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు

కొత్తకొండ జాతరకే కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపల్లి గ్రామం నుంచి 65ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు. మూడురోజులుగా రైతులు కష్టపడి తమ ఎడ్లబండ్లను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది జాతరకు తీసుకొచ్చారు. 65 ఎండ్లబండ్ల రథాలను సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఇంటికి వెళ్లిపోయాయి. అందమైన ఎడ్లబండ్లను చూసేందుకు జాతరకు వచ్చిన భక్తులు ఆసక్తిగా చూశారు. వీటితో పాటు వేలాది ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాయి. వేలేరు గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు పలువుర్ని ఆకట్టుకున్నాయి. కొన్నేళ్లుగా మేకలబండ్లు వేలేరు నుంచి రావడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం అర్ధరాత్రి మేకల బండ్లు రావడంతో ఆలయ అధికారులు వాటిని ఆలయం ముందుకు తీసుకవచ్చారు. ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామాల సునీతలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వీరభద్రస్వామి



భద్రకాళి అమ్మవారు

పారిశుధ్యం భేష్

కొత్తకొండ జాతరలో పారిశుద్య సేవలు భేష్‌గా ఉన్నాయి. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఆధ్వర్యంలో జాతరలో అధికారుల సేవలను పరిశీలించారు. డీపీవో జగదీశ్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవోలు నాగరాజు, రవి పర్యవేక్షణలో పారిశుధ్య సేవలు రాత్రి పగళ్లు అందించారు. సుమారు 40మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు, 150మంది కార్మికుల సిబ్బందితో ఆలయం చుట్టూ, పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్మికులు 24గంటలు చెత్తను తొలగించారు. ప్రతీ దుకాణం ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. జాతరలో చెత్తాచెదారం, చెడిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు.



వేలేరు నుంచి వచ్చిన మేకల రథం



శ్రీవీరభద్రస్వామిని దర్శించుకుంటున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా



గండదీపంలో నూనె పోస్తున్న యువతులు

సంక్రాంతి సంబరాలు

అలరించిన ముగ్గుల పోటీలు ● విజేతలకు బహుమతుల పంపిణీ



ఇప్పగూడెంలో సంక్రాంతి వేడుకలు జరుపుకుంటున్న చిన్నారులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముగ్గు వేస్తున్న బాలికలు, మహిళ



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముగ్గుల విజేతకు బహుమతులు అందిస్తున్న ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పార్శీ కమల్



జనగామలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల పంపిణీ



కొడకండ్లలో ముగ్గులను పరిశీలిస్తున్న నిర్వాహకులు



జఫర్‌గడ్‌లో భక్తితో బసవన్న కింది నుంచి దాటుతున్న ఓ బాలుడు

పశు వైద్యంపై పట్టింపేది?

శిథిలావస్థకు చేరిన భవనాలు ● సిబ్బంది కొరతతో రైతుల ఇబ్బంది ● అత్యవసర సేవలకు ఔషధాలూ కరువే

చిలుపూర్, జనవరి 16: అత్యవసర సేవల్లో ఒకటైన పశువైద్యంపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి. పశు వైద్య విభాగానికి సంబంధించి జిల్లాలో ఎక్కడ చూసినా శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనాలే దర్శనమిస్తున్నాయి. నాడు అన్ని విభాగాలకు సంబంధించి కళకళలాడిన పశువుల ఆస్పత్రులు నేడు సిబ్బంది కొరతతో వెలవెలబోతున్నాయి. సకాలంలో పశువులకు వైద్యమందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశు సంవర్ధక శాఖలో ఏర్పడ్డ ఖాళీలను గత పాలకులు భర్తీ చేయకపోవడం, ఆస్పత్రి భవన నిర్మాణాలు, సబ్‌సెంటర్ల భవనాలపై దృష్టి సారించకపోవడం వల్లే నేడు ఈ దుస్థితి దాపురించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా, జిల్లాలో మొత్తం నలుగురు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, 23 మంది వైద్యాధికారులు, 9మంది వెటర్నరీ అసిస్టెంట్ స్థాయి అధికారులు మాత్రమే సేవలందిస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, పసరమడ్ల, కొడవటూరు, నెల్లుట్ల తదితర ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులతో పాటు, పలు గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. అంతేకాకుండా ఆస్పత్రుల స్థాయికి అవసరమైన సిబ్బంది కొరత నిత్యం వేధిస్తోంది. వీఎల్‌వో, జేవీవో, ఎల్ఎస్ఏ, వెటర్నరీ అసిస్టెంట్ల పోస్టుల ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొత్తం 40మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిన 28 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి పశువులకు పంపిణీ చేసే టీకాల పంపిణీ సమయంలో సైతం సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు గ్రామాల్లో పశువుల సంఖ్య ఇటీవల గణనీయంగా పడిపోయినప్పటికీ, పాడి ఆవులు, గేదెల పెంపకంతో పాటు, పౌల్ట్రీ రంగం వైపు రైతులు ప్రత్యేక దృష్టి సారించడంతో పశువైద్యుల అవసరం మరింత కీలకమైంది. పాడిగేదెలతో పాటు, గొర్రెలు, మేకలకు సంభవించే రోగాలకు అత్యవసరంగా అందించే మందులు సైతం కొన్ని సందర్భాల్లో ప్రైవేటులో కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పశువైద్యం పటిష్ఠతకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మల్యాపూర్‌లో శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల భవనం

పశువైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి..

సాదం రమేష్, జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి



గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పశు సంవర్ధక శాఖ పూర్తిగా నిర్వీర్యమైంది. జిల్లాలో చాలా చోట్ల ఆస్పత్రి భవనాలు, సబ్ సెంటర్లు శిథిలావస్థకు చేరాయి. సిబ్బంది కొరత కారణంగా పశువులకు సకాలంలో వైద్యమందడం లేదు. ఆస్పత్రులు, సబ్ సెంటర్ల నిర్మాణాలకు పక్కా భవనాలు మంజూరు చేయడంతో పాటు, రెగ్యులర్ పద్ధతిన వైద్యులు, సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలి. పాడి గేదెలకు సంభవించే సీజనల్ రోగాలతో పాటు, ఇతర అత్యవసర సేవలకు గోపాలమిత్ర, ఇతర ప్రైవేటు పశు వైద్య సిబ్బందిని ఆశ్రయించక తప్పడం లేదు.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

ఎస్ఎల్. మనోహర్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి



జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన పశువుల ఆస్పత్రులు, సబ్‌సెంటర్లకు కొత్త భవనాలు నిర్మించడంతో పాటు, సిబ్బంది కొరత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. పశువుల్లో సంక్రమించే సీజనల్ వ్యాధుల విషయంలో గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నాం. టీకాలు, మందుల పంపిణీలో సిబ్బంది కృషి చేస్తున్నారు. మందుల కొరత లేనే లేదు. సమస్యలుంటే పాడి రైతులు నేరుగా మండల పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

జాతర అభివృద్ధి పనులకు నిధులిప్పించండి

● టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరకు వినతి పత్రం

చిలుపూర్, జనవరి 16 : మండల కేంద్రంలోని మబ్బుగుట్ట సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించాలని జాతర చైర్మన్ రాజ్‌కుమార్ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, వచ్చే నెల 21 నుంచి ప్రారంభమయ్యే మబ్బుగుట్ట వన దేవతల జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున కనీస సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని, మూత్రశాలలు, సామూహిక మరుగుదొడ్లు, తాగునీటి వసతి, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టేందుకు రూ.30 లక్షలు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీనివాస్, గనగోని నవీన్, పిట్టల జంపయ్య, సాలయ్య, వీరనారాయణ, కనకరాజు, కోల రమేష్, నారగోని పరమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సింగపురం ఇందిరకు వినతిపత్రం ఇస్తున్న జాతర కమిటీ చైర్మన్ బోళ్ళ రాజ్‌కుమార్

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

చిన్నపెండ్యాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, సీనియర్ నాయకుడు మామిడాల యాదవ రెడ్డి నేతృత్వంలో స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బీజేపీ నాయకుడు గంగుల రవిందర్ రెడ్డితో పాటు తాళ్ళపల్లి సమ్మయ్య, రాజన్‌బాబు, రాజ్, రాజ్‌కుమార్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తౌటి సునీల్‌గౌడ్, జీడి కోర్నేల్, ఇల్లందుల యాదగిరి పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలంటూ వినతి..

జఫర్‌గడ్: గ్రామంలో దెబ్బతిన్న రోడ్లు, చెరువు కట్టు కాలువ మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూరారం గ్రామస్థులు సింగపురం ఇందిరను కోరారు. మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి.అంజద్, గ్రామస్థులు కలిసి మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇందిరను కలిసి సమస్యలను విన్నవించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, ఊర చెరువు సంబంధించిన కట్టు కాలువ కోతకు గురైందని, ఈ విషయంలో గతంలో పలు మార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదని నివేదించారు. అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులు చేపట్టేలా చూడాలని ఇందిరను కోరారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్

ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు

పట్టించుకోని పాలకులు, ప్రజాప్రతినిధులు



ప్రమాదకరంగా ఉన్న గుంటూరుపల్లి బస్‌షెల్టర్

నర్మెట, జనవరి 16: మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలబడేందుకు నీడ లేక, కూర్చునేందుకు చోటు లేక బస్సుల రాక కోసం ఎదురుచూస్తూ పడరానిపాట్లు పడుతున్నారు. ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేజీ వద్ద ఉన్న బస్ షెల్టర్ నెర్రెలు పట్టి, సగం కూలిపోయి మొత్తం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రయాణికులు అందులో కూర్చోవాలంటే భయాందోళన చెందుతున్నారు. జనగామ- నర్మెట ప్రధాన రహదారిని ఆనుకునే ఈ గ్రామం ఉన్నా ప్రజాప్రతినిధులు ఎవరూ దాన్ని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రయాణికుల బస్ షెల్టర్ నిర్మించాలని గుంటూరుపల్లి గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మహాజాతర అభివృద్ధి పనులపై ఆరా

● మేడారంలో పర్యటించిన కలెక్టర్, పీవో, అదనపు కలెక్టర్

● త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

మేడారం, జనవరి 16 : ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం వేర్వేరుగా మేడారంలో పర్యటించారు. మహాజాతర జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యంత్రాలు, నిర్మాణ సామగ్రి, కూలీల లభ్యత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. జాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జంపన్నవాగు నుంచి ఊరట్టం స్థూపం వరకు పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సీ1, సీ2 పార్కింగ్ కోసం సుమారు 95 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. గ్రౌండ్ లెవలింగ్‌ను సక్రమంగా చేపట్టి వారంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ పైప్‌లైన్ల ఏర్పాటు, మహిళలు వస్త్రాలు మార్చుకునే గదుల నిర్మాణం, ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల పూడికతీత, వాగులో ఇసుక చదును పనులను కలెక్టర్, పీవో పరిశీలించారు. మేడారం పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు అధిక సంఖ్యలో కార్మికులను వినియోగించాలన్నారు. వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలంలో కాజ్‌వే పనులను పరిశీలించారు. అనంతరం ఐటీడీఏ అతిథిగృహంలో శాఖల వారీగా అధికారులతో చర్చించారు.



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పీవో అంకిత్

రాములోరి అక్షింతల పంపిణీ



రత్నతండాలో అక్షింతలను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నర్మెట, జనవరి 16 : మండలంలోని ఇప్పలగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని రత్నతండాలో మంగళవారం అయోధ్య రాముని అక్షింతలను పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరుగుతూ జై శ్రీరాం నినాదాలతో అక్షింతలను ప్రజలకు అందజేసి రామ మందిర దర్శనానికి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ధరావత్ రాజు, ధరావత్ వినోద్, ధరావత్ రమేష్, బాలు కాల్‌రాం, లచ్చిరాం పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రోజారాణి



చిన్నపెండ్యాల రైస్‌మిల్లులో స్టాకును పరిశీలిస్తున్న రోజారాణి

చిలుపూర్, జనవరి 16 : నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీసీఎస్‌వో) రోజారాణి రైస్‌మిల్లర్లను హెచ్చరించారు. మంగళవారం ఆమె రాజవరం, మల్కాపూర్, చిన్నపెండ్యాల తదితర గ్రామాల్లో రైస్‌మిల్లులను సందర్శించి ధాన్యం బస్తాలతో పాటు, రికార్డులను పరిశీలించారు. ఇటీవల ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి నిబంధనల మేరకు బియ్యం అందించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, నాగరాజు, నాయక్ పాల్గొన్నారు.

శివునిపల్లిలో ఘనంగా గోపూజ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా కనుమ పండుగను పురస్కరించుకుని మంగళవారం శివునిపల్లిలో గోపూజ ఘనంగా నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం వద్ద గోపూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గోపూజలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై గోమాతను భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి ప్రతినిధులు వి.తిరుమల శ్రీనివాస్, ఎన్.వెంకట్రాం నర్సయ్య మాట్లాడారు. గోవు పాలు, గోమూత్రం, గోమయం అన్ని మానవాళికి ఎంతో మేలు చేస్తాయన్నారు. గోమూత్రంతో దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయన్నారు. గోమయం క్రిమి కీటకాలను దరి చేరనీయదన్నారు. అందుకే గోవును మాతగా పూజించాలన్నారు. కార్యక్రమంలో శివునిపల్లి సర్పంచ్ బూర్ల విష్ణు, నాయకులు కె.శరత్‌కుమార్, ఐత సంతోష్, జిపై గిరి, రమేశ్, పూజారి మోహన్‌శర్మ పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడోత్సవాలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ అనిత

జనగామ టౌన్, జనవరి 16: పట్టణంలోని 17వ వార్డు యువకులకు ఆంజనేయ యూత్ సహకారంతో ఆ వార్డు కౌన్సిలర్ జక్కుల అనితవేణుమాధవ్ క్రికెట్ క్రీడోత్సవాలను నిర్వహించారు. మంగళవారం క్రీడలను స్థానిక ప్రిస్టన్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యూత్ సభ్యులు కమాలుద్దిన్, కందుల రాజు, కేమిడి కృష్ణ, మాటూరి శ్రీను, పండుగ సాయి, మార్క ప్రవీణ్, నిమ్మ రాకేశ్, రాఘవుల మహేశ్, శంకర్, చిలకమారి మనోహర్, చింతకింది నరేశ్, కిరణ్, విక్రమ్, బేజాడి కేశవులు, కరపాటి రాజ్‌చంద్ర, పిట్టల సతీశ్, చిగురు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగం

జనగామ టౌన్, జనవరి 16: నిరుద్యోగ యువకులకు పీఎంకేవైసీ పథకం ద్వారా ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ ఇండియా కార్య నిర్వాహక అధికారి శ్రీనివాస్ ప్రకటించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్, డ్రోన్ తయారీ, అసెంబ్లీ టెక్నీషియన్, 5జీ టెక్నీషియన్ యాక్టివ్ నెట్‌వర్క్ ఇన్‌స్టాలేషన్ రంగంలో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేసి ఉద్యోగం కల్పిస్తామని పేర్కొన్నారు. ఉత్సాహవంతులైన యువకులు ఈ నెల 16 నుంచి 15 వరకు జనగామ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల గౌరీ ప్లాజాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 87129 57902, 70939 91843, 99085 12387 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీసుల అదుపులో కోడి పందాల నిర్వాహకులు

కొడకండ్ల, జనవరి 16 : మండలంలోని లక్ష్మక్కపల్లి పరిధిలోని ఇటుక బట్టీల వద్ద కోడిపందాలు నిర్వహించిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటుకబట్టీల్లో పనిచేసే ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లాకు చెందిన ఒర్సు సైదులు, చల్ల అరవింద్, శనగల సుబ్బారావు, పెనుగొండ గోపిని పోలీసులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద రూ.2 వేల నగదును 2 కోళ్ళను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జనగామ టౌన్, జనవరి 16: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను జనగామ పోలీసులు అరెస్టు చేశారు. జనగామ సీఐ శ్రీనివాస్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణంలోని బతుకమ్మ కుంట దగ్గర్లోని ఓ ఇంట్లో గోదల వంశీధర్‌రెడ్డి, మహేశ్వరం రమేశ్, పబ్బోజు బ్రహ్మయ్య, చెట్టిపల్లి సంజీవరెడ్డి మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్సైలు అరుణ్, సృజన్ తన సిబ్బందితో కలిసి ఆ ఇంటిపై దాడులు నిర్వహించారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.51,630తో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

బచ్చన్నపేట, జనవరి 16: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో రహదారి వెంట వెళుతున్న వారిని మంగళవారం తేనె టీగలు దాడి చేశాయి. బచ్చన్నపేటకు చెందిన మాడిశెట్టి రాజయ్య, ఇటుకాలపల్లికి చెందిన చంద్రారెడ్డి, మహేశ్వరి, కొడవటూరు మహేశ్, బోనకొల్లూరుకు చెందిన సందీప్‌కుమార్, బాల్‌రాజు ద్విచక్ర వాహనాలపై వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా తేనె టీగలు చుట్టుముట్టి కుట్టాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఎవరు అందుబాటులో లేకపోవటంతో జనగామ ఏరియా ఆస్పత్రికి పంపించారు. కాగా, బచ్చన్నపేటలో 30 పడకల ఆస్పత్రి ఉన్నప్పటికీ వైద్యులు అందుబాటులో ఉండడంలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ మండల ఇన్‌చార్జిగా సదానందం

లింగాలఘణపురం, జనవరి16: లింగాలఘణపురం మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నవాబుపేటకు చెందిన బూడిది సదానందంను నియమిస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

ప్రజాసమస్యలపై అవిశ్రాంత పోరాటం



చిలుపూర్‌లో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి పైస రాములు

చిలుపూర్, జనవరి 16 : ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా సీపీఐ అవిశ్రాంత పోరాటం చేస్తోందని ఆ పార్టీ మండల కార్యదర్శి పైస రాములు అన్నారు. మంగళవారం చిలుపూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఏ విధంగా పోరాడాలన్న విషయమై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన చిలుపూర్ మండల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. చిలుపూర్ అంగడిలో బస్‌షెల్టర్ నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రతీ ఊరికి రోడ్డు రవాణా, బస్ సౌకర్యం కల్పించడంతో పాటు, వెంకటేశ్వర్లపల్లి నుంచి చిలుపూర్ మీదుగా వెంకటాద్రిపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బోనగిరి కుమార్, పిట్టల కుమార్, సంతోష్, వికాస్, సందీప్, నిఖిల్, శివ, అన్వేష్, రాకేశ్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న అర్చకులు రాజేశ్వరాచార్యులు

జనగామ కల్చరల్, జనవరి 16: మకర సంక్రాంతి మహా పర్వదినాన్ని పురస్కరించుకొని అయ్యప్ప పడిపూజా మహోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం జనగామ జిల్లా కేంద్రం లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఉదయం గణపతి హోమం, విశేష అష్టాదశ అభిషేకం, విశేష అలంకరణ, సహస్ర పుష్పార్చన నిర్వహించారు. సంధ్యాసమయంలో దేవాలయ ప్రధానార్చకులు కాసోజు రాజేశ్వరాచార్యుల నేతృత్వంలో అయ్యప్ప స్వామి వారికి సహస్ర దీపాలంకరణ, సహస్ర పుష్పార్చన, దివ్య పడిపూజ ఘనంగా నిర్వహించారు. మకర జ్యోతి దర్శన నేపథ్యంలో జరిగిన పడిపూజ సందర్భంగా అయ్యప్ప స్వాముల శరణుఘోషతో దేవాలయ పరిసరాలు మార్మోగాయి. దివ్య పడిపూజ అనంతరం ఆలయ ప్రధానార్చకులు భక్తులకు మహదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామిని శ్రీనివాస్, కందుకూరి నాగరాజు, తొడుపునూరి ప్రసాద్, తడకమల్ల నర్సింహారావు, కొల్లూరు ఆనందం, బోడకుంటి తుకారాం పాల్గొన్నారు.